క్లుప్తంగా

8న విద్యా సంస్థల బంద్



పోస్టరు విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాలు

పాణ్యం: కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న విద్యా సంస్థల బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. శనివారం పాణ్యంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు ప్రతాప్, రఫీ, బాలాజీ మాట్లాడుతూ కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా వేలమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

సౌత్‌జోన్ క్రీడలకు ఆర్‌జీఎం విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్

పాణ్యం: నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు సౌత్‌జోన్ క్రీడలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ శనివారం ఈ విషయం తెలిపారు. ఈనెల 13 నుంచి 18వ తేది వరకు కేరళలో సౌత్‌జోన్ బాస్కెల్‌బాల్ పోటీలు జరుగుతాయి. తమ కళాశాలకు చెందిన వరుణ్‌కుమార్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, కుందనరెడ్డి జేఎన్‌టీయూ తరపున జట్టుకు ఎంపికయ్యారన్నారు.

శరవేగంగా ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం



బస్తిపాడు జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు జగనన్న కాలనీలో ఓవర్ హెడ్‌ట్యాంక్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఇందుల్లో భాగంగా సుమారు రూ.40లక్షలతో కాలనీలో ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. దీంతో పాటు విద్యుత్ సదుపాయం, అంతర్గత రోడ్ల కల్పన పనులు జరుగుతున్నాయి.

వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



చిన్నరాముడును పరామర్శిస్తున్న కురువ సంఘం నాయకులు

కర్నూలు (న్యూటౌన్): గూడూరు మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన కురువ చిన్నరాముడుపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కురువ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కురువ చిన్నరాముడును వారు పరామర్శించి మాట్లాడారు. జిల్లాలో కురువ కులస్తులపై దాడులు పెరిగాయని, తమ మంచితనాన్ని చేతకానితనంగా చూస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సంఘం గూడూరు మండల అధ్యక్షుడు కృష్ణ, నాయకులు తిరుపాల్, తవుడు శ్రీనివాసులు, కేసీ నాగన్న, చిన్న గిడ్డయ్య, అయ్యన్న తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

టన్నెల్ నిర్మాణ పనులపై మైనింగ్ అధికారుల ఆరా



చెన్నై-సూరత్ జాతీయ రహదారి టన్నెల్ పనులను తనిఖీ చేస్తున్న మైనింగ్ డీడీ రాజశేఖర్

కర్నూలు (న్యూటౌన్): నగర శివారులోని రింగ్‌రోడ్డు సమీపంలో చెన్నై - సూరత్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మెగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ చేపట్టిన టన్నెల్ నిర్మాణ పనులను జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తనిఖీ చేశారు. శనివారం టన్నెల్ నిర్మాణ పనులతో పాటు నిర్మాణంలో వినియోగిస్తున్న గ్రావెల్, ఎర్త్ మెటల్‌ను ఎక్కడికి తరలిస్తున్నారని మైనింగ్ అధికారులు ఆరా తీశారు. అనంతరం టన్నెల్ తవ్వకాలను ఆయన పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఏడీ విజిలెన్స్ బైరాగి నాయుడు, మెగా ఇంజినీరింగ్ ప్రతినిధి శ్రీరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- వైఎస్‌ఆర్‌సీపీ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- కరిమద్దెలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన



కరిమద్దెల గ్రామంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: ప్రజాసాధికారత లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు,పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే గ్రామంలో ఇంటి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. కొందరు తమకు పింఛన్లు, ఇంటి పట్టాలు, గృహాలు మంజూరు చేయాలని, మరికొందరు కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు వేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయా విన్నపాలను పరిశీలించి అర్హులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

మళ్లీ వైఎస్ జగన్ ఆశీర్వదించాలి

సంక్షేమ పథకాలు అమలు కావాలంటే, నవరత్నాలు మీ ఇంటికి రావాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కాటసాని ప్రజలను విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. గతంలో ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల సిఫార్సు ఉండాలని గుర్తు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలను ఎలా కత్తిరించాలా అనే ఆలోచనతో పరిపాలన చేయగా నేడు జగనన్న ప్రభుత్వం అర్హులను వెతికి మరీ లబ్ధి చేకూర్చు తోందన్నారు. పారదర్శక పాలన అంటే ఇదే అని పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామన్నారు. గత పాలనకు, ప్రస్తుత పాలనకు ఉన్న తేడాను గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో 175 స్థానాలకు 175 సీట్లు వైఎస్ఆర్‌సీపీ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, సర్పంచులు సుంకన్న, నాగేశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయ కమిటీ చైర్మన్ శిరుప శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, పార్టీ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లయ్య, కృష్ణారెడ్డి, డాలుస్వామి, శివానందరెడ్డి, ఎల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమేష్, ఏపీఎం హజరత్, ఏఈలు భాస్కర్, మూర్తి, పవన్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు దరఖాస్తుల వెల్లువ

- ఓటరు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను స్వీకరించిన బీఎల్‌ఓలు



పాణ్యంలో పోలింగ్ బూత్ వద్ద దరఖాస్తులు పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి

పాణ్యం: నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు అవగాహన సదుస్సులకు విశేష స్పందన లభించింది. రెండురోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో తొలిరోజు ఓటరు నమోదుకు దరఖాస్తులు పెద్ద సంఖ్యలో వచ్చాయి. ప్రతి పోలింగ్ కేంద్రంలో బూత్ లెవల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండి ప్రజల నుంచి అభ్యంతరాలు, దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు, కల్లూరు మండలాలు కలిపి ఓటరు నమోదుకు (ఫారం-6) 586, తొలగింపునకు (ఫారం -7) 153, మార్పులు చేర్పులకు సంబంధించి (ఫారం-8) 205 దరఖాస్తులు వచ్చాయని ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంపు నేడు కూడా జరుగుతుందని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

పాణ్యం నియోజకవర్గంలో మొదటి రోజు వచ్చిన వివిధ దరఖాస్తులు

మండలం	ఫారం-6	ఫారం-7	ఫారం-8	మొత్తం
పాణ్యం	92	15	30	137
గడివేముల	129	29	36	194
ఓర్వకల్లు	146	48	42	236
కల్లూరు	219	61	97	377
	586	153	205	944

ఓటు నమోదు క్యాంపు పరిశీలన

కల్లూరు: మండలంలోని పోలింగ్ కేంద్రాల దగ్గర బీఎల్‌ఓలు ఓటు నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించారు. శనివారం తహసీల్దార్ టీవీ రమేష్ బాబు శరీన్‌నగర్, శాంతినికేతన్ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఫామ్ 6-290, ఫామ్ 7-61, ఫామ్ 8-97 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

ఆయకట్టుకు నీరు అందించాలి

కర్నూలు (సిటీ):మండలంలోని దుద్యాల, ఆర్.కొంతలపాడు, ఎదురూరు, జి.శింగవరం, నిడ్జూరు గ్రామాల్లోని కేసీ కెనాల్ ఆయకట్టుకు నీరు అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని జి.శింగవరం సబ్‌స్టేషన్ ఎదుట వారు రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆందోళనకు ప్రజాసంఘాలతో పాటు టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. కెనాల్ పరిధిలో రైతులు కూరగాయలు, మొక్కజొన్న, వరి, మిర్చి తదితర పంటలను సాగు చేశారన్నారు. మరి కొద్ది రోజుల పాటు సాగునీటిని అందిస్తే ఆ పంటలు పండుతాయని తెలిపారు. అనంతరం ఆందోళనకారులు సబ్‌స్టేషన్ ప్రధాన గేటుకు తాళం వేసి అధికారులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. కర్నూలు తాలూకా సీఐ శ్రీరామ్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు అక్కడికి చేరుకుని రైతులకు సర్ది చెప్పారు. జిల్లా కలెక్టర్ దృష్టికి సాగునీటి సమస్య తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజల సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. నాలుగున్నరేళ్లలో పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తాగునీటి, మురుగునీటి, విద్యుత్ స్తంభాల సమస్యలను వివన్నవించగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కాగా అంతకు ముందు ఎమ్మెల్యే సుధాకర్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్, కర్నూలు మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్ఎం బాషా, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, వైస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నకొండయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ శేషఫణి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీను తనిఖీ

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తనిఖీ చేశారు. టీచర్ల హాజరు రికార్డులను, సిబ్బంది వివరాలను పరిశీలించారు. స్కూల్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్, వంట గది, పాఠశాల పరిసరాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. సోషల్ సబ్జెక్టుకు టీచర్ లేరని తెలుసుకుని వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధి అధికారులకు ఫోన్‌లో సూచించారు.

నేడు గడప గడపకు..

మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం - 1 పరిధిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ సందీప్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుధాకర్ ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటారన్నారు.

అధికారుల తీరుపై కౌన్సిలర్ల మండిపాటు



నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న కౌన్సిలర్ దస్తగిరి

గూడూరు: మున్సిపల్ అధికారుల తీరు పట్ల పలువురు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. వార్డు సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడంలేదని అధికార పార్టీ కౌన్సిలర్లు దస్తగిరి, కలామ్, బజారి, రామాంజనేయులు తదితరులు అధికారుల తీరుపై మండి పడ్డారు. వార్డుల్లో ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తన వార్డులో తనకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు చేస్తుండటాన్ని నిరసిస్తూ నేల మీద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. కొంతసేపు కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించారు. వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్ జోక్యం చేసుకుని సమావేశానికి రప్పించారు. చైర్మన్ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అధికారులు కౌన్సిలర్లు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. 7 వ వార్డులో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించాలని సభ్యురాలు రత్నమ్మ కోరారు. 8వ వార్డులో తాగు నీటి సమస్య తీర్చాలని ఆ వార్డు కౌన్సిలర్ పద్మావతి కోరారు. కోఆప్షన్ మెంబర్ రామాంజనేయులు మాట్లాడుతూ పట్టణంలో రహదారుల విస్తరణ చేపట్టాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ -2 బోయ లక్ష్మన్న, కౌన్సిలర్లు సురేష్, బుడ్డంగలి, కార్యాలయ మేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై నివేదికలు సిద్ధం చేయండి

- నాలుగు మండలాల అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కర్నూలు (సిటీ): కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని గూడూరు, సి.బెళగల్, కోడుమూరు, కర్నూలు రూరల్ మండలాల పరిధిలో అభివృద్ధి పనులు, పెండింగ్ పనులకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం స్టాంటన్‌పురంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ శాఖల ఇంజినీర్లతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని పెండింగ్ పనులు, కొత్తగా అభివృద్ధి చేయాల్సిన పనులు, ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోకుండా ఉన్న సమస్యలు, తదితర వాటిపై ఈనెల 7వ తేదీన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, నియోజకవర్గాల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించనున్నారన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించాల్సిన అంశాలపై నివేదికలు, సమస్యల పరిష్కారానికి కావలసిన నిధుల కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గంలో సుమారుగా 12 గ్రామాల్లో ఫ్లోరైడ్ వాటర్ సమస్య ఉందని, ఆయా గ్రామాల్లో శుద్ధ జలం అందించేందుకు ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గూడూరు నగర పంచాయతీ జులకల్ గ్రామానికి ఇళ్ల పట్టాలు ఇచ్చి పొజిషన్ చూపించలేదని, చనుగొండ్లలో ఇళ్ల స్థలాలకు భూ కేటాయింపు జరగలేదన్నారు. కోడుమూరు నుంచి వెల్దుర్తి, సుంకేసుల నుంచి తిమ్మందొడ్డి, పోలకల్ నుంచి కంబందహాల్, సి.బెళగల్ నుంచి సంగాల తదితర గ్రామాలకు రహదారుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీటితో పాటు దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇంకా నియోజకవర్గంలో ఏమైనా సమస్యలు ఉంటే నివేదికల్లో పొందుపరచాలని ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులను కోరారు. సమావేశంలో అధికారులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సకాలంలో సేవలు అందించండి

- కార్యాలయాల చుట్టు తిప్పుకోవద్దు
- సర్వసభ్య సమావేశంలో సచివాలయ ఉద్యోగులు, అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రం గడివేముల ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. కొంత మంది సచివాలయ ఉద్యోగులు సరిగ్గా పనిచేయడం లేదని, ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే కాటసాని దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీటీసీ అర్‌బీ చంద్రశేఖరరెడ్డి అలగనూరు రిజర్వాయర్‌కు త్వరగా మరమ్మతులు చేయిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యేకు విన్నవించారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇంటిస్థలాలు అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థకు చెడ్డపేరు తీసుకువచ్చే వారిపై, పని చేయని ఉద్యోగులపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకం అందాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య తక్కువ ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి రోజు పరిశీలించాలని సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. అలగనూరు రిజర్వాయర్ పరిస్థితిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రూ.27 కోట్లతో ప్రతిపాదనలు కూడా పంపినట్లు చెప్పారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు చేయడం జరుగుతుందన్నారు. కేసీ కెనాల్‌కు వస్తున్న నీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులను కోరారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ప్రతి సమస్యను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. కొర్రపోలూరు గ్రామంలో రైతుల, ప్రజల సౌలభ్యం కోసం నిర్మిస్తున్న 220 కేవీ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన పొలాల సేకరణ పనులు పూర్తి చేయాలన్నారు. 15 రోజుల్లో టెండర్లు పిలిచి పనులు ప్రారంభ కావాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా నిరుపేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ,వై వైస్ ఎంపీపీ హైమావతి, సర్పంచ్‌లు నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు వంగాల మహేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ మొల్లా జబీన్, హార్టికల్చర్ అధికారిణి దివ్య, ఏపీఎం హజరత్, ఏఈలు భాస్కర్, పవన్‌కుమార్, ఏపీఓ వెంకటరమణ, ఎంఈఓ-2 విమలా వసుంధరాదేవి, పశువైద్యాధికారులు సాయి హరిణి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు వెళ్లి పింఛన్ అందజేత



మాదన్నకు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రామచంద్రుడు

కోడుమూరు రూరల్: మండలంలోని లద్దగిరికి చెందిన వృద్ధుడు మాదన్న అనారోగ్యంతో కర్నూలు విశ్వభారతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న లద్దగిరి వెల్ఫేర్ అసిస్టెంట్ ఆస్పత్రికి వెళ్లి మాదన్నకు శనివారం పింఛన్ అందజేశారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

కల్లూరు: సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కర్నూలు డివిజన్ ప్రత్యేక అధికారి (డీఎల్‌డీఓ) పి.బాలకృష్ణ రెడ్డి అన్నారు. శనివారం కె.మార్కాపురం గ్రామ సచివాలయంలో రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పించాలని ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవి కిషోర్ పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రత కల్పించాలి

కోడుమూరు రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ యాప్‌లో ప్రతి కుటుంబాన్ని నమోదు చేసి ఆరోగ్య భద్రత కల్పించాలని డీఎల్‌డీఓ బాలక్రిష్ణారెడ్డి గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో డీఎల్‌డీఓ బాలక్రిష్ణారెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్‌లు సమావేశం నిర్వహించి ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య శ్రీ యాప్‌లపై అవగాహన కల్పించారు. ఈనెల 10లోగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని డీఎల్‌డీఓ ఆదేశించారు. సమావేశంలో పంచాయతీ ఈఓ అజయ్‌భాస్కర్ ఉన్నారు.

ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు రూరల్: అర్హులైన యువతీ, యువకులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జయన్న సూచించారు. శనివారం రామాపురం, లద్దగిరి, గోరంట్ల, వెంకటగిరి, కోడుమూరులలోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ సందర్శించి బీఎల్వోలకు పలు సూచనలిచ్చారు.

విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంచాలి

కల్లూరు: విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంచాలని, ఆదిశగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం పర్ల గ్రామంలోని ఎంపీపీఎస్ హరిజనవాడ, ఎంపీపీఎస్ రెగ్యులర్ పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయులు హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను ఉపాధ్యాయులు గుర్తించి వెలికితీయాలన్నారు.

ఉపాధి పనులపై గ్రామ సభలు

కల్లూరు: మండలంలో 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై గ్రామాల్లో సామాజిక తనిఖీ గ్రామ సభలు జరుగుతున్నాయి. శనివారం ఉలిందకొండ, పర్ల గ్రామాల్లో నిర్వహించి ఈ ఆర్థిక సంవత్సరానికి గుర్తించిన అంశాలను చదివి వినిపించారు. ఆయా కార్యక్రమాల్లో ఎపీఓ మద్దేశ్వరమ్మ, ఇండిపెండెంట్ అబ్జర్వర్లు ఏఓ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, సర్పంచు హనుమక్క, సుంకులమ్మ, డీఆర్పీలు రవికుమార్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఓర్వకల్లు: మండల పరిధిలోని కాల్వబుగ్గ కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మరణించారు. ఈ సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గడివేములకు చెందిన పిక్కిలి నారాయణ(63) కర్నూలు-నంద్యాల రహదారిలో నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. చుట్టుపక్కల వారు గమనించి 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈమేరకు మృతుడి కుమారుడు మద్దిలేటి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

11న మైనారిటీ దినోత్సవం

కర్నూలు (న్యూటౌన్): భారతరత్న డాక్టర్ మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీ మైనారిటీ సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు. శనివారం జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి సయీద సబిహ పర్వీన్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మైనార్టీ దినోత్సవం సందర్భంగా అబుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్రపై ఈనెల 7వ తేదీన వ్యాసరచన, వక్తృత్వ పోటీలను మాధ్యమిక, ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలో వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గడియారం ఆసుపత్రి పక్కన ఉన్న ప్రభుత్వ మైనారిటీ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సెల్: 94417 61206కు సంప్రదించి పేరు రిజిస్టర్ చేయించుకోవాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన వారికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు శనివారం డ్యాం అధికారులు తెలిపారు. రిజర్వాయర్ లో 0.484 టీఎంసీల నీరు నిల్వ ఉంది.